పెద్దలనెదిరించి
ప్రేమించి
పెళ్లి చేసుకున్న
ఆమె జీవితంలో
సుఖపడిందా?

# బురద—వరద

శిలివేరి
నారాయణ
స్వామి
కథ

''రాజూ! మనిద్దరం ప్రేమించుకున్న విషయం మా నాన్నగారికి నేనింకా చెప్పలేదు. చెబితే, ఏమంటారో, ఏం చేస్తారోనని భయంగా ఉంది''.

''ఔను పద్మా! ప్రేమంటే పెద్దలకెందుకో గిట్టదు. మన పెళ్లి విషయం గురించి నేను కూడా మా నాన్నకు చెబుదామనుకుంటున్నాను''.

''ఒకవేళ మీ నాన్నగారు ఒప్పుకోకపోతే' కొంత బాధపడుతూ అంది పద్మ.

''వాళ్లు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, నేను నీ వాణ్ణి, నువ్వు నా దానివి'' రాజు, పద్మ చేతిలో చెయ్యివేసి చెప్పడంతో, ఆ అమ్మాయి కళ్ల నుండి రెండు ఆనందబాష్పాలు నేలమీద పడ్డాయి.

వారి కులాలు వేరు, మతాలు వేరు. అయినా అభ్యుదయ భావాలు కలవారు. ప్రేమకు అడ్డుగోడలా నిలిచే పెద్దల నెదుర్కోవాలనుకున్నారు. స్వచ్ఛమైన ప్రేమకున్న విలువేంటే సమాజానికి చాటి చెప్పాలనుకున్నారు.

ఒకరోజు పద్మ తన తండ్రి వద్దకు వచ్చి—

''నాన్నా! నేను రాజు ప్రేమించుకున్నాం. మీరు అంగీకరిస్తే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం'' లోపల జంకు ఉన్నా బయటకు చూడ్డానికి మాత్రం ధైర్యంగానే ఉంది.

''నేనొప్పుకోకపోతే ఆ అబ్బాయిని మర్చిపోతావా!'' వినయంగా అన్నాడు పద్మ తండ్రి రామయ్య.

''నాన్నా!'' తెరచిన నోరు తెరచినట్లే వుండిపోయింది ఓ నిమిషం పాటు.



"అంటే, నేనొప్పుకోకపోయినా ఆ పిల్లవాడినే పెళ్లి చేసుకుంటానంటావ్".

"అవును, ఆ నిర్ణయమే తీసుకోవాలనుకుంటున్నాను".

'మరిలాంటప్పుడు నన్నడగడం దేనికి!'

"పెద్దవారని".

"పెద్దవారని అడిగావ్ కాబట్టే చెబుతున్నాను విను. బేబీ! నువ్వు చిన్న పిల్లవి.

జీవితంలో ఎదురు దెబ్బ, వెన్నుపోటు తినితిని అనుభవంతో చెబుతున్నాను. ఆ రాజుగాడితో నీ ప్రేమ కథ ఇంతటితో ముగించు. ఈ రోజు నుండి వాడికి నీకు మధ్య ఎటువంటి సంబంధం లేదు. మీ ఇద్దరి మధ్య ఉత్తరం ముక్క కూడా తిరగడానికి వీల్లేదు'' కరకు గుండెతో మాట్లాడుతున్న రామయ్య కంటి నుండి ఒక నీటి బొట్టు రాలింది. తుడుచుకొని బాధపడుతూ—

''ప్రేమ వివాహాల జీవితాలు సవ్యంగా సాగవమ్మా! అనుమానాలకు దారితీస్తాయ్. నువ్వు పెళ్లి చేసుకున్నాక, నీ కాపురంలో ఏ చిచ్చు రగిలినా నీకంటే పదిరెట్లు బాధపడేది నేనేనమ్మా'' ముఖమ్మీది కండరాలు ముడుచుకొని పోయాయి.

''నాన్నా! మీరెంతో విశాల హృదయుల నుకున్నాను. ప్రేమికులను మీరెందుకు అర్థం చేసుకోరు!'' ప్రశ్నించింది పద్మ.

''ప్రేమ హు..'' ఓ పిచ్చి నవ్వు నవ్వి— ''ప్రేమన్నది కేవలం యవ్వన వ్యామోహం, టీనేజ్ డిసీజ్'' విరక్తిగా అన్నాడు రామయ్య .

''హు.. మీరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా మా పెళ్లి మాత్రం ఖచ్చితంగా జరిగి తీరుతుంది'' విసురుగా అని ఇంట్లో నుండి వెళ్లబోయింది పద్మ.

''ఏమండీ! అమ్మాయి...'' ఏడ్చుతూ కూతురునాపే ప్రయత్నం చేసింది రామయ్య భార్య సీత.

''సీతా! నా మాటను ధిక్కరించిన క్షణాన్నే మన కూతురు చచ్చిపోయింది. ఇప్పుడు నీ కన్నీళ్లు దాన్ని ఆపినా, రేపైనా మనమాట వింటుందని నమ్మకం లేదు వెళ్లనీ'' గుండెను రాయిగా చేసుకొని అన్నాడు రామయ్య.

పద్మ బయటకు వెళ్లింది.

సీత కన్నీరు వరదలై పారింది. అట్లని రామయ్య ఏడ్వకుండా ఉండగలడా!

* * *

పద్మకు ఎదురైన పరిస్థితే, రాజుకు కూడా తన ఇంటి వద్ద ఎదురయింది. అతను కూడా, తల్లిదండ్రుల మాటలను తిరస్కరించి పద్మ మెడలో మూడుముళ్లు వేయడానికి సిద్ధమయ్యాడు.

పద్మ, రాజు ఇద్దరూ ఓ చోట కలుసుకున్నారు.

తల్లిదండ్రులెవరూ రాకపోయినా, బంధువులంతా చీదరించుకున్నా, స్నేహితుల అండదండలతో వారిద్దరూ ఓ శుభముహూర్తాన దంపతులయ్యారు.

వారి కాపురం పువ్వుకారు కాయలుగా విలసిల్లుతోంది. ఆణిముత్యాల్లాంటి ఇద్దరు కొడుకులు పుట్టారు. మాతృత్వంలోనున్న మధురిమకెంతో మురిసిపోయింది పద్మ.

''ఏమండీ! నేను ఆపరేషన్ చేయించుకుంటానండి'' భర్తతో అంది పద్మ.

''ఎందుకులేవోయ్. ఇద్దరూ మగపిల్లలే కదా! ఈసారి ఆడపిల్ల పుడుతుందేమో చూద్దాం'' భార్య బుగ్గను సాగదీస్తూ అన్నాడు రాజు.

భర్త నిర్ణయంతో ఏకీభవించక తప్పలేదామెకు.

రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు ఆఫీసు నుండి చిటపటలాడుతూ వచ్చాడు రాజు.

''పద్మా! నీ ప్రవర్తన నాకేం నచ్చటంలేదు. ఆ ఎదురింటి రమేశ్ గాడితో నీకేం పని. ఎప్పుడూ మాట్లాడుతూ ఉంటావ్. ఆ...'' గద్దించాడు.

''ఉద్యోగం చేస్తుంటే ''వద్దు, నిన్ను నేను పోషించలేనా, ఉద్యోగం మానెయ్'' అన్నారు. అలాగేనని ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చున్నాను. మీరు ఆఫీస్‌కు వెళ్లినపుడు ఒంటరిగా ఉండటవలన నాకెంతో బోర్ కొడుతోంది ఏమీ తోచక పిక్కీల కోసం వెళ్లి మాట్లాడాను. అది కూడా తప్పేనా!''

'పిక్కీల కోసమే వెళ్లావా! ఇంకేమైనా..

''ఏమిటండి. ఈ రోజు మీరిలా మాట్లాడుతున్నారు'' భయంతో కంపించిపోతూ అంది పద్మ.

''నేను మామూలుగానే ఉన్నాను. నువ్వే మారిపోయి, నన్ను మారుస్తున్నావ్''


''అసలేం జరిగిందో చెప్పండి!''

''ఇంకేం జరగాలి'' అంటూ పళ్లు పటపట కొరికి, ''చూడు! ఇప్పటి నుండి నువ్వు వానింటికి వెళ్లడం కాని, వాడు మనింటికి రావడం గాని, మాట్లాడ్డం గాని జరిగిందో నేనేం చేస్తానో నాకే తెల్దు'' రాజు కళ్లు ఎర్రబడ్డాయి. రౌద్ర రూపం దాల్చాడు.

ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకొని భోరుమని ఏడ్చింది పద్మ, ఇంకా ముందు ఏం జరుగుతుందోనన్న భయంతో.

పద్మపై రాజుకు రోజురోజుకీ అనుమానం ఎక్కువకాసాగింది. ఏ మగాడితో పలకరింపుగా మాట్లాడినా అనుమానమే. బయటకు రాకుండా ఇరవై నాలుగ్గంటలూ బిక్కుబిక్కుమంటూ ఇంట్లోనే కూర్చునేది. జీవచ్ఛవంలా బ్రతుకుతున్నందుకు బాధపడేదిప.

* * *



"దబ్... దబ్... దబ్" తలుపు చప్పుడు కావడంతో వెళ్లి తెరిచింది.

ఎదురుగా సుధాకర్, కాలేజీ రోజుల్లో ఫ్రెండ్.

"హల్లో సుధాకర్! ఏమిటిలా వచ్చావు" భర్త ప్రవర్తన గుర్తుకొచ్చి భయపడుతూనే చిరునవ్వుతో పలకరించింది.

"నీ కోసమే" పద్మవైపు ఆశగా చూశాడు సుధాకర్.

"ఏమిటి నువ్వు మాట్లాడేది! అర్థమయ్యేట్టు చెప్పు" సూటిగా ప్రశ్నించింది పద్మ.

"నీ భర్త ఆఫీసుకు వెళ్లాడు. పిల్లలు నిద్రపోతున్నారు. ఇప్పుడు నువ్వు నా కోరిక తీర్చాలి. నా కౌగిట్లో కరిగిపోవాలి" క్రింది పెదవిని పై పళ్లతో రాస్తూ అన్నాడు.

"మర్యాదగా బయటకు వెళతావా లేదా!" కఠినంగా అంది పద్మ.

"అహ, అట్లని నిన్ను బలవంతంగా రేప్ చెయ్యను. నువ్వే నాతో సహకరించాలి. నా కోరిక తీర్చాలి. చూడు పద్మా! నువ్వు నన్ను ప్రేమిస్తూ విరహవేదనతో రాసిన ఉత్తరం నా దగ్గరింకా పదిలంగా ఉంది. నువ్విప్పుడు నాతో సహకరించకపోతే ఆ ఉత్తరం రాజు చేతిలో పడుతుంది. అప్పుడు నీ సంసారం ముక్కలవుతుంది. బాగా ఆలోచించుకో" వెకిలిగా నవ్వుతూ అన్నాడు సుధాకర్.

"సుధాకర్! నా సంసారం నాశనం చెయ్యొద్దు. నీకు చేతులెత్తి మొక్కుతున్నాను. దయచేసి ఇక్కణ్నుండి తొందరగా వెళ్లిపో".

"నా కోరిక తీరకుండా నేనెళ్లిపోతే నీ సంసారమేమవుతుందో ఒక్కసారి ఊహించుకో" దర్పం చూపించాడు.

"భగవంతుడా! ఎన్ని కష్టాలు తెచ్చావయ్యా!" దేవుని పటానికి మొక్కి వచ్చి బలంగా ఒక్కతోపుతో సుధాకర్‌ను బయటకు తోసేసి తలుపుకు గడియవేసింది".

"నువ్వు నన్ను తోయడమేంటే, నేనే వెళ్లిపోతాను. నీ కొంప ఏమవుతుందో చూడు" వెళ్లిపోతూ సుధాకర్ అంటున్న మాటలు పద్మకు స్పష్టంగా వినబడుతూనే ఉన్నాయి. గుండె దిబ్బరం చేసుకొంది.

ముందుగానే అనుమానం మనిషి. ఆ లెటర్ చూస్తే... ఇక ఆలోచించలేకపోయింది. భారమంతా దేవునిమీదే వేసింది.

ఆఫీసు నుండి రాజు సమయానికి ఇంటికి రాకపోయే సరికి పద్మ అనుమానం మరింత బలపడింది. ఏం జరుగుతుందో ఏమో అన్న ఉత్కంఠతో మెదడు మొద్దుబారిపోయింది.

రాత్రి తొమ్మిదిన్నర వరకు భర్త రాకకోసం ఎదురు చూసిన పద్మ, పిల్లలకు కాస్త అన్నంపెట్టి నిద్రపుచ్చి, తను మాత్రం తినకుండా మంచమ్మీద వాలిపోయింది. అలా పడుకుందో లేదో అప్పుడే తలుపు చప్పుడయింది. వెళ్లి తలుపు తెరిచింది భయపడుతూనే.

"ఏమే! నువ్వు ఎంతకు బరితెగించిన దానివే" ఇంట్లోకి రాకముందే పాయింటు అందుకున్నాడు.

"ఏమయిందండి. ఏంటలా మాట్లాడుతున్నారు" ఎందుకలా అంటున్నాడో తెలిసి నా తెలియనట్లుంది.

''ఏమీ తెలియనట్లు నటించకు. ఈ ఉత్తరం చదువు, నీకే తెలుస్తుంది'' చేతికిచ్చాడు.

లెటర్ చదివి చించి పారేసింది కోపంగా.

''ఎంత పొగరే నీకు'' కోపంతో చెయ్యి చేసుకున్నాడు.

అతని కుడిచేతి వేళ్లు ఆమె ఎడమ చెంపమీద అచ్చయ్యాయి.

''నీకు, ఆ సుధాకర్ గాడికి ఏమిటి సంబంధం!'' పళ్లు పటపట నూరాడు. కళ్లు చింతనిప్పులయ్యాయి.

ఏడ్చింది తలను గోడకేసి బాదుకొంది.

''ఇప్పుడవన్నీ చెప్పినా మీ కర్థం కావు. ముందు మీరు భోంచేసి పడుకోండి తర్వాత మాట్లాడుకోవచ్చు'' ఏడుస్తూనే అంది.

''నిషా తలెకెక్కిన రాజు తూలి క్రింద పడిపోయాడు. తలకు చిన్న గాయ కావడంతో ప్రథమ చికిత్స చేసింది భార్య.

ఎలాగో అతి భారంగా తెల్లారింది.

''పద్మా! నన్ను ప్రేమించక ముందేవాన్ని ప్రేమించావ్ కదూ!'' ఉత్తరానికి సంబంధించిన ఆలోచనలు, అనుమానాలు రాజును వెంటాడుతూనే ఉన్నాయి.

''ఊ'' ఔనన్నట్లు తలూపింది.

''మీ మధ్య కేవలం ఉత్తరాలే నడిచేవా! ఇంకా ఏమైనా జరిగిందా!''

''ఆ ఉత్తరమే మా ప్రేమకు తొలి, తుది ఉత్తరం''

''ప్రేమించిన దానివి, అతన్నే ఎందుకు పెళ్లి చేసుకోలేకపోయావ్!''

''అతని క్యారెక్టర్ మంచిది కాదని తెలిశాక...'' మాట తడబడుతోంది. గొంతు ఎండిపోతోంది.

''అంటే నేను నీకు మంచివాడిలా కనిపించానా!''

మీరిలా అడుగుతుంటే నేనేం సమాధానం చెప్పగలను. సుధాకర్‌కు నాకూ మధ్య పలకరింపులే తప్ప మరే సంబంధమూ లేదు, నిర్భయంగా చెప్పింది.



## కాలం

''రాముడు అడవికి పోయేను. ఇది ఏ కాలంరా'' అడిగాడు తెలుగు మాస్టారు.

''పోయే కాలం సార్'' చెప్పాడు విద్యార్థి.

– సి.నాగరత్న
(హిందూపురం)

''ఎన్ని మాటలు నేర్చావే! నేను ఐ లవ్ యూ అంటే ఐ లవ్‌యూ అన్నావ్. పార్కుకెళదామా అంటే వెళదాం పద అన్నావ్. నేను సినిమాకెళ్తుంటే నాతోపాటే వచ్చావ్. లాడ్జికి వెళదామంటే నోరెత్తకుండా వచ్చావ్. పెళ్లికి ముందే నాతో అంతగా తిరిగిన దానివి, ఆ సుధాకర్ గాడితో కూడా అలా తిరగలేదని నేనెలా నమ్మమంటావ్'' రాజు ఊగిపోతున్నాడు.

''మీరు నాకు అన్యాయం చేయరనుకొని నా సర్వస్వం మీ కర్పించాను, అంతే'' గద్గద స్వరంతో అంది.

''వాన్ని గురించి కూడా అలాగే ఊహించుకొని ఉండొచ్చు గదా!''

''నన్ను నమ్మండి. నేనే పాపం చెయ్యలేదు'' కాళ్లు పట్టుకొంది.

''నో'' అరచి ''నువ్వెన్ని మాటలు చెప్పినా నేను నమ్మను'' బుసకొడుతూ అన్నాడు.

మీరు నమ్మినా నమ్మకపోయినా నేను చెప్పేది మాత్రం ఒక్కటే. నాకూ సుధాకర్‌కు మధ్య మీరనుకుంటున్న సంబంధం ఏ మాత్రం లేదు. కేవలం ప్రేమించానని తెలుపుతూ ఉత్తరం రాశానంతే.

''నాకు రాసింది కూడా ఒక ఉత్తరమే. మరి నాతో అలా లేవే! నాతోపాటు సినిమాలు చూశావ్! షికార్లు కొట్టావ్! అసలు, ఇంతగా చెడిపోయిన దానివి ఈ బిడ్డల్ని నాతో కన్నావని గ్యారంటీ ఏమిటి'' సిగరెట్ దమ్ములాగి పొగను భార్య మొఖమ్మీదికి వదిలాడు.

''ఏమండీ! అంత మాటనొద్దు. ఈ పిల్లలు మీ పిల్లలే. మీ వలన పుట్టిన వారే'' కాళ్లు పట్టుకొని రోదించింది.

''ఆ... ఈ మాటంటే ప్రతి ఆడదానికీ ఏడ్వొస్తుంది లేవే! వెళ్లు! ఈ క్షణం నుండి నువ్వు ఈ ఇంట్లో ఉండటానికి వీల్లేదు'' ఇద్దరు పిల్లలనూ భార్యనూ బయటకు తోసేశాదు బలవంతంగా

ఈ పరిస్థితుల్లో తను ఎక్కడకు వెళ్లాలి.

తల్లిదండ్రుల వద్దకు వెళితే... ప్చ్.... వారి నెదిరించే కదా ఇన్ని కష్టాలు తెచ్చుకున్నది. వారి వద్దకెళ్లడానికి మనసొప్పలేదు.

అత్తమామలు చేరదీస్తారేమోనని వారింటికి వెళ్లి తన దీనగాథను చెప్పుకొంది.

''అలాంటి వగలాడివి కాబట్టే నా కొడుక్కి నానా రుచులు చూపించి, వాన్ని నీ కొంగుకు చుట్టేసుకొని దక్కకుండా చేశావ్. మా కొచ్చే రెండు లక్షల కట్నం కూడా రాకుండా చేశావ్. మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఇక్కడ కొచ్చావ్! చెడిపోయిన ఆడదాన్ని బయటకు తరిమెయ్యక ఇంట్లో వుంచుకొని సంసారం చేస్తారనుకున్నావా! వెళ్లు! వెంటనే ఇక్కడ నుండి వెళ్లు. నువ్వు వెళ్లకపోతే బలవంతంగా గెంటేస్తాను'' అత్తగారి విష పదజాలానికి పద్మ గుండె పగిలి వెయ్యి ముక్కలయ్యింది.

''భగవంతుడా!'' వీధిలోకొచ్చి మొరపెట్టుకొంది.

ఇప్పుడు తనకేది దారి!

తల్లిదండ్రులను తను వదులుకుంది. భర్త చేత చీదరించబడింది. అత్తమామల వల్ల దూషించబడింది. ద్వేషించబడింది.

ఒకన్ని నడిపించుకుంటూ, ఇంకొకన్ని ఎత్తుకొని, మరొక బిడ్డను కడుపులో దాచుకొని, వాహ్! ఎంతటి దురవస్థ. దారి వెంట వెళుతోంది.

బాగా బాగా ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంది.

* * *

''పోస్ట్'' పోస్ట్‌మాన్ కేకతో బయటకొచ్చి కవరందుకున్నాడు రాజు.

ఆతురతగా కవరు విప్పి అక్షరాల వెంట పరుగెత్తాడు.

భర్తకు నమస్కారం,

నేను ఏ పాపం చెయ్యకపోయినా, మీరెందుకో నా మీద చాలా అనుమానపడుతున్నారు.మీరునన్ను శారీరకంగా, మానసికంగా హింసిస్తుంటే, పిల్లల భవిష్యత్తు కోసం ఆరాటపడుతూ నరకాన్ని భరిస్తూ, అనుభవిస్తూ వచ్చాను. ఇక నాలో సహనం చచ్చిపోయింది. మన ఇద్దరు పిల్లలనూ ఇద్దరికి దత్తతకిచ్చాను. మూడో బిడ్డను నాతోనే తీసుకెళ్తున్నాను. ఈ ఊరి చివరున్న పాత బంగళాలో నా శవం ప్రేలాడుతూ ఉంటుంది. మీ అనుమాన పొరలు తొలిగితే నా శవానికి దహన సంస్కారాలు జరిపించండి. ఇంకా మీకు నా మీద నమ్మకం కుదరకపోతే, దయచేసి మీరు నా శవాన్ని కూడా చూడ్డానికి రావొద్దు. దుర్భర విషాద జీవితం కంటే చావే నయమనుకున్నాను.

ఇట్లు,
మీ భార్య
పద్మ

## మీకు తెలుసా!

*స్వీడన్‌లో ప్రతి పౌరుడు కనీసం 1 సం. కాలం మిలటరీలో పనిచేయాలన్న నిబంధన ఉంది. మన దేశంలోను ఇలా పెడితే సరి! దేశభక్తి అప్పుడన్నా వస్తుంది మన ప్రజలకి!*

*టానిక్‌లన్నింటికన్నా బలవర్ధకమయిన టానిక్ కొబ్బరికాయ నీళ్లు!*

*– రజనీ శకుంతల*

*(సికింద్రాబాద్)*

